# ఆముదం

ప్రపంచంలో ఆముదం సాగు విస్తీర్ణం మరియు ఉత్పత్తుల్లో మనదేశం ప్రథమ స్థానంలో వుంది. మన రాష్ట్రం గుజరాత్ తర్వాత ద్వితీయ స్థానంలో ఈ పంటను పండిస్తున్నది. ఈ పంట మన రాష్ట్రంలో సుమారు 1.57 లక్షల హెక్టార్లలో పండింపబడుతూ, 0.80 లక్షల టన్నుల ఉత్పత్తితో హెక్టారుకు 511 కిలోల దిగుబడి మాత్రమే ఇస్తున్నది(2008-09). ఆంధ్రప్రదేశ్ దేశంలోని ఆముదం విస్తీర్ణంలో 2వ స్థానం, ఉత్పత్తిలో 3వ స్థానం మరియు ఉత్పాదకతలో 7వ స్థానంలో ఉది. ఈ పంటను మహబూబ్‌నగర్ మరియు నల్గొండ జిల్లాల్లో విస్తారంగానూ, కర్నూలు, రంగారెడ్డి, కరీంనగర్ మరియు ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో సాధారణంగా పండిస్తున్నప్పటికీ అన్ని జిల్లాల్లోనూ ప్రత్యేకించి రబీలో ఈ పంటను ఆరుతడి పంటగా పండించటానికి చాలా అవకాశముంది. రబీలో ఆరుతడి క్రింద వేసే వేరుశనగ మరియు మొక్కజొన్న పంటలతో పోలిస్తే, ఆముదం పంటకు అడవి పందుల బెడద లేకపోవటం విశేషం.

ఆముదం నూనెను వైమానిక రంగంలో, జెట్ మరియు రాకెట్ పరిశ్రమలలో లూబ్రికెంట్‌గాను, పాలిష్‌లు, ఆయింట్‌మెంట్లు మరియు మందుల తయారీల్లోను, డీజిల్ పంపుసెట్లలో డీజిల్‌కు ప్రత్యామ్నాయ ఇంధనంగాను, సబ్బులు మరియు డిటర్జెంట్లు తయారు చేసే పరిశ్రమల్లో, రంగులు మరియు ముద్రణ కొరకు ఉపయోగించే సిరా తయారీలో, లినోలియం, నైలాన్ దారాలు మరియు ప్లాస్టిక్ వస్తువులు తయారుచేసే పరిశ్రమల్లోను వాడుచున్నారు. ఆముదపు లేత ఆకులను 'ఏరి' పట్టు పురుగులకు ఆహారంగా ఉపయోగిస్తున్నారు.

**నేలలు :** అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. నీరు బాగా ఇంకే నేలల అనుకూలం. చవుడు నేలల్లో మరియు నీరు నిలువ ఉండే నేలల్లో పండించరాదు.

**నేల తయారి :** నేలను వేసవిలో రెండు, మూడు సార్లు దున్ని గుంటకతో చదును చేయాలి.

**విత్తనశుద్ధి :** కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కార్బండైజిమ్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి. విత్తన శుద్ధి చేయటం ద్వారా మొలక కుళ్ళు తెగులు (ఫైటోఫ్తోరా బ్లైట్), ఆల్టర్‌నేరియా ఆకుమచ్చ తెగులు మరియు కొంత వరకు వడలు తెగులును అరికట్టవచ్చు.

**విత్తేసమయం :** ఖరీఫ్‌లో జూన్ 15 నుండి జూలై 31 వరకు, తొలకరి వర్షాలకు విత్తాలి. రబీ ఆముదము సాగుకు రాష్ట్రమంతటా అనుకూలం. నీటి పారుదల సౌకర్యం వున్నచోట అక్టోబరు నుండి నవంబరు నెలాఖరు వరకు విత్తుకొని అధిక నికర లాభం సాధించవచ్చు. వరి మాగాణుల్లోనూ, వరికి ప్రత్యామ్నాయంగానూ ఈ పంటన సాగుచేసుకోవచ్చు.

**విత్తేదూరం మరియు విత్తన మోతాదు**

| పరిస్థితులు | రకాలు/సంకర రకాలు | విత్తన మోతాదు (కి/ఎ) | విత్తేదూరం (సెం.మీ.) |
|---|---|---|---|
| ఖరీఫ్ | | | |
| బరువైన నేలలు, అధిక వర్షపాతం | అధిక దిగుబడినిచ్చే రకాలు | 2-2.5 | 90×60 |
| | సంకర రకాలు | 2.0 | 90×90 |
| తేలిక నేలలు, తక్కువ వర్షపాతం | అధిక దిగుబడినిచ్చే రకాలు | 4 | 90×45 |
| | సంకర రకాలు | 2-2.5 | 90×60 |

| పరిస్థితులు | రకాలు/సంకర రకాలు | విత్తన మోతాదు (కి/ఎ) | విత్తేదూరం (సెం.మీ.) |
|---|---|---|---|
| నీటి పారుదల క్రింద సాగుకు | సంకర రకాలు | 2 | 90×90 |
| రబీ(నీటి పారుదల క్రింద) | | | |
| సారవంతమైన నేలలు | సంకర రకాలు | 2 | 120×90 |
| తేలిక నేలలు | సంకర రకాలు | 2 | 90×90 |

**రకాలు**

| రకం | పంటకాలం (రోజుల్లో) | దిగుబడి (కి/ఎకరాకు) వర్షాధారంగా | గుణగణాలు |
|---|---|---|---|
| **సూటి రకాలు** | | | |
| క్రాంతి | 90-150 | 5.5-6.5 | త్వరగా కోతకు వస్తుంది. బెట్టను తట్టుకుంటుంది. గింజ పెద్దదిగా ఉంటుంది. |
| హరిత | 90-180 | 5.5-6.5 | ఎండు తెగులును బాగా తట్టుకుంటుంది. |
| కిరణ్ | 90-150 | 5.0-6.0 | బెట్టను తట్టుకుంటుంది. బోడికాయల వల్ల బూజు తెగులు తాకిడి తక్కువగా ఉంటుంది. |
| జ్యోతి | 90-150 | 5.0-6.0 | ఎండు తెగులును బాగా తట్టుకుంటుంది. |
| జ్వాల | 90-180 | 4.0-5.0 | ఎండు తెగులును మరియు కొంత వరకు బూజు తెగులును తట్టుకుంటుంది. |
| **హైబ్రిడ్ రకాలు** | | | |
| జి.సి.హెచ్.4 | 90-180 | 5.5-7.0 | |
| డి.సి.హెచ్.177 | 90-180 | 6.0-7.5 | బెట్టను తట్టుకుంటుంది. ఎండుతెగులును బాగా తట్టుకుంటుంది. |
| డి.సి.హెచ్.519 | 90-180 | 6.0-7.5 | ఎండు తెగులును తట్టుకుంటుంది. |

పై రకాలన్నీ ఖరీఫ్ మరియు రబీ కాలాలకు అనుకూలం. అయినప్పటికీ రబీ కాలంలో నీటి పారుదల క్రింద సాగు చేసేటప్పుడు హైబ్రిడు రకాలను వేసుకొని అధిక దిగుబడి సాధించవచ్చు. క్రాంతి, హరిత, కిరణ్ రకాలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం నుండి జ్యోతి, జ్వాల, డి.సి.హెచ్ 177, డి.సి.హెచ్. 519 విత్తనాలను నూనెగింజల పరిశోధనా సంచలనాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్ నుండి పొందవచ్చు.

## పోగుంతలు మరియు ఒత్తు మొక్కలు పీకివేయుట :

విత్తిన 7-10 రోజులలో మొలక వస్తుంది. విత్తిన 15-20 రోజులకు కుదురుకు ఒకే మొక్క ఉండే విధంగా ఒత్తు మొక్కలను పీకివేయాలి. అదే సమయంలో విత్తనం మొలవని చోట పోగుంతలు పెట్టుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం :**

ఎకరానికి 2 టన్నుల పశువుల ఎరువును దుక్కిలో వేసి కలియ దున్నాలి. రకాలను సాగు చేసేటప్పుడు 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం మరియు 12కిలోల పొటాషియం విత్తేటప్పుడు వేసుకోవాలి. పైపాటుగా 6 కిలోల నత్రజని విత్తిన 30-35 రోజులకు, మిగిలిన 6 కిలోల నత్రజని విత్తిన 60-65 రోజులకు వేసుకోవాలి. సంకర రకాలు సాగుచేసేటప్పుడు అదనంగా మరొక 6 కిలోల నత్రజనిని విత్తిన 90-95 రోజులకు వేసుకోవాలి.

**కలుపు నివారణ, అంతరకృషి :** విత్తిన 40-60 రోజుల వరకు పంటలో కలుపు లేకుండా చూడాలి. పెండిమిథాలిన్ 30% 1.3 నుండి 1.6 లీ. లేదా అలాక్లోర్ 50% తేలిక నేలల్లో 800మి.లీ. బరువు నేలల్లో 1 లీటరు చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజున గాని పిచికారి చేయాలి. విత్తిన 20 రోజులకు మరియు 40 రోజులకు గుంటక లేదా గొర్రుతో అంతరకృషి చేసి కలుపు నివారించుకోవాలి.

**నీటియాజమాన్యం :** ఖరీఫ్‌లో ఆముదంను వర్షాధారంగా పండిస్తారు. రబీకాలంలో, ఎర్ర చల్కా భూముల్లో అక్టోబర్ నుండి డిసెంబరు మాసం వరకు 12-15 రోజులకొకసారి నీరు యివ్వాలి. జనవరి మాసం నుండి ప్రతి 8-10 రోజులకొకసారి నీరివ్వాలి. నల్లరేగడి భూముల్లో అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు 15-20 రోజుల కొకసారి మరియు జనవరి మాసం నుండి 12-15 రోజులకొకసారి నీరిస్తే సరిపోతుంది. మొక్కలు పుష్పించే దశలో నీటి ఎద్దడి రాకుండా చూడాలి.

**సస్యరక్షణ**

**పురుగులు**

**ఎర్రగొంగళి పురుగు :** ఈ పురుగు ఉధృతి జూన్-జూలై మాసాల్లో పైరు మొలచిన వెంటనే అధికంగా ఉంటుంది. గొంగళి పురుగులు ఆకుల కాడలను, ఈనెలను, లేత కొమ్మలను మాత్రమే మిగుల్చుతాయి. ఎదిగిన గొంగళి పురుగులు ఒక పొలం నుండి ఇంకొక పొలంలోకి గుంపులుగా వలసపోయి పైరుని నష్టపరుస్తాయి. గొంగళి పురుగు ఎరుపు గోధుమ రంగు కలిగి, శరీరానికిరువైపులా నల్లని చారలు కలిగి ఉంటుంది. పురుగు శరీరమంతా పొడవాటి ఎరుపు గోధుమ వెంట్రుకలతో కప్పబడి ఉంటుంది. తల్లిపురుగు తెలుపు రంగు రెక్కలు కలిగి, రెక్కల వెలుపలి అంచు వెంట పసుపు పచ్చని చార కలిగి ఉంటుంది.

**సమగ్ర యాజమాన్యం :** వేసవిలో భూమిని లోతుగా(15-30 సెం.మీ.)దున్నుకోవాలి. లోతు దుక్కులు చేయడం వలన కోశస్థ దశలో భూమి లోపలి పొరల్లో దాగున్న ఎర్రగొంగళి పురుగు, శనగపచ్చ పురుగు, పొగాకులద్దె పురుగు మరియు వేరు పురుగులు బయటపడి ఎండ తీవ్రతకు గాని, పక్షుల బారినపడిగాని చనిపోతాయి. భూమి తేమను నిలుపుకొనే సామర్థ్యాన్ని పెంచుకుంటుంది. కలుపు సమస్య తగ్గుతుంది మరియు పంటను సకాలంలో విత్తుకోవచ్చును. ఆముదానికి ముందుగా, పొలంగట్లపైన అక్కడక్కడా దోస నాటడం వల్ల ఎరగా ఉపయోగపడుతుంది. తొలకరి వర్షాలు వచ్చినప్పుడు రాత్రి 7.00-10.00 గం.ల సమయంలో రైతులందరు సామూహికంగా మంటలు పెట్టడం ద్వారా మరియు దీపపు ఎరలను అమర్చడం ద్వారా రెక్కల పురుగులను అరికట్టవచ్చు. ఎదిగిన గొంగళి పురుగులు ఒక పొలం నుండి వేరొక పొలంలోకి పోకుండా పొలం చుట్టు లోతైన నాగటి చాలును తీసి అందులో మిథైల్ పెరాథియాన్ 2% లేదా ఎండోసల్ఫాన్ 4% లేదా క్వినాల్‌ఫాస్ 1.5% పొడి మందును(ఒక కిలో పొడి మందు 70 మీ.ల. నాగటి సాలులో) చల్లి పురుగులను నివారించవచ్చు. ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**దాసరి పురుగు/నామాల పురుగు :** ఈ పురుగు ఆగస్టు, సెప్టెంబర్ మరియు అక్టోబర్ మాసాల్లో తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. లద్దె పురుగులు తొలి దశలో ఆకులను గీకి తర్వాత దశలో రంధ్రాలేర్పరిచి ఆకులను తింటాయి. పెద్ద పురుగులు బూడిద రంగులో ఉండి ప్రక్కలకు ఎరుపు మరియు ముదురు గోధుమ రంగు చారలు లేదా నల్లగా

ఉండి ప్రక్కలకు తెలుపు రంగు చారలుంటాయి. పెరిగిన లద్దె పురుగులు భూమిలో గాని, క్రింద పడిన ఎండిన ఆకులలో గాని లేదా ముడుచుకొన్న ఆకులలో గాని కోశస్థ దశలోకి ప్రవేశిస్తాయి. కోశస్థ దశలోని పురుగుపై తెల్లని బూడిద కప్పబడి వుంటుంది. రెక్కల పురుగు వెనక జత రెక్కల మధ్యలో తెల్లని చార ఉండి 3-4 ముదురు గోధుమ రంగు చుక్కలు వెలుపలి అంచువెంట ఉంటాయి.

**సమగ్ర యాజమాన్యం :** ఆగష్టు మరియు సెప్టెంబర్ మాసాల్లో ఎకరాకు 50,000 ట్రైకోగ్రామా పరాన్న జీవులను వదిలి దాసరి పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చు. ఆగష్టు, సెప్టెంబరు మరియు నవంబర్ మాసాల్లో లద్దెపురుగును మైక్రోప్లైటిస్ మాక్యులిపెన్నిస్ మరియు యూప్లెక్ట్రస్ మాటర్నస్ అను పరాన్న జీవులు ఎక్కువగా ఆశించి లద్దె పురుగులను అదుపులో వుంచుతాయి. దాసరి పురుగు మొదటి దశలో అవసరమైతే పరాన్న జీవులకు హాని చేయని వేపనూనె (5 మి.లీ.) లేదా బేసిల్లస్ తురింజెన్సిస్ అనే బాక్టీరియా మందును ఒక గ్రాము లీటరు నీటి మోతాదులో కలిపి ఆకుల అడుగు భాగం బాగా తడిచేలా పిచికారి చేయడం వల్ల అరికట్టవచ్చు. కార్బరిల్ (50%) 3గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ (36%) 1.6 మి.లీ. అసిఫేట్ 1.5 గ్రా. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి ఆకుల అడుగు భాగం బాగా తడిచేలా పిచికారి చేయడం ద్వారా దాసరి పురుగును అరికట్టవచ్చు. దాసరి పురుగులు పెద్దవిగా ఉన్నపుడు వాటిని ఏరి నాశనం చేయాలి. పొలంలో ఎకరాకు 10 పక్షి స్థావరాలను పక్షులు వాలేందుకు వీలుగా అమర్చినట్లైతే పొలంలోకి పక్షులు వచ్చి పురుగులను ఏరి తింటాయి. పంట పూర్తిగా కోసిన తర్వాత పొలంలోని చెత్తను కాల్చినట్లయితే కోశస్థ దశలోని దాసరి పురుగును నివారించవచ్చును.

**పొగాకు లద్దెపురుగు :** పొగాకు లద్దెపురుగు ఆగష్టు మాసం నుండి ఆశించి, అక్టోబర్ మరియు నవంబర్ మాసాల్లో తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. దీని లద్దెపురుగులు తొలి దశలో గుంపులుగా ఆకుల క్రింది భాగంలో చేరి పత్రహరితాన్ని గీకి తింటాయి. ఆకులపై రంధ్రాలేర్పరచి జల్లెడాకులుగా మారుస్తాయి. లద్దెపురుగులు గొట్టం ఆకారంలో ఉండి పాలిపోయిన ఆకుపచ్చ/గోధుమ రంగు కలిగి శరీరంపై నల్లని మచ్చలు ఉంటాయి.లద్దెపురుగులు పగటి వేళల్లో మట్టి పెడ్డల క్రింద లేదా నెర్రెల్లో దాక్కొని రాత్రి వేళల్లో పైరును ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయి.

**సమగ్ర యాజమాన్యం :** వేసవిలో నేలను లోతుగా దున్నుకోవాలి. గుడ్ల సముదాయాలను, పిల్ల లద్దె పురుగులున్న ఆకులను మరియు లద్దెపురుగులున్న జల్లెడాకులను ఏరి నాశనం చేయాలి. ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలను అమర్చాలి. తొలిదశలో లద్దెపురుగుల నివారణకు వేపనూనె 5మి.లీ. లేదా క్లోర్‌పైరిఫాస్ 2.5 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇండాక్సాకార్బ్ 1 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. విషపు ఎరను చిన్న ఉండలుగా తయారు చేసి, సాయంకాలం పొలంలో అక్కడక్కడ చల్లడం ద్వారా లద్దెపురుగులను అదుపుచేయవచ్చు. ఎకరా పంటకు 5 కిలోల తవుడు, అర కిలోబెల్లం, 500 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేక 500 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేక 500గ్రా.ల కార్బరిల్‌లను తగినంత నీటిలో కలిపి విషపు ఎరను తయారుచేసుకోవాలి.

**కొమ్మ మరియు కాయ తొలిచే పురుగు :** ఈ పురుగు ఉధృతి పంట పుష్పించే దశ నుండి మొదలై పంట పూర్తి కాలం వరకు ఉంటుంది. తొలిదశలో పురుగు కొమ్మలపై మరియు కాయలపై ఉన్న పత్రహరితాన్ని గీకి తింటుంది. పుష్పించే దశలో కొమ్మలోకి పోవడం వల్ల కొమ్మ ఎండిపోతుంది. తర్వాత దశల్లో కాయలోకి చొచ్చుకొనిపోయి కాయలను నష్టపరుస్తుంది. లార్వా పాలిపోయిన పచ్చరంగులో ఉండి వీపుపైన గులాబి రంగు కలిగి, కణుపుల వద్ద చిన్న వెంట్రుకలు ఉంటాయి. రెక్కల పురుగులు పసుపు వర్ణం కలిగి రెక్కలపైన నల్లని మచ్చలు కలిగి ఉంటాయి. దీని నివారణకు పూతదశలో ఒకసారి మరియు 20 రోజులకు మరొకసారి మోనోక్రోటోఫాస్ 2 మి.లీ. లేదా అసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇండాక్సాకార్బ్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**బీహారి గొంగళి పురుగు :** ఈ పురుగు గుడ్ల సముదాయాన్ని నవంబర్-డిసెంబర్ మాసాల్లో గమనించవచ్చు. డిసెంబర్-జనవరి మాసాల్లో గుడ్ల నుండి బయటకు వచ్చిన పిల్ల పురుగులు కొద్ది రోజుల్లోనే పొలంలోని ఆకులన్నింటిని తిని తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయి. మొక్కలపై ఆకులు లేనపుడు కాయలున్న గెలలను తిని నష్టపరుస్తాయి. దీని

నివారణకు గ్రుడ్ల మరియు పిల్లల సముదాయాన్ని ఆకులతో సహా ఏరి నాశనం చేయాలి. తొలి దశలో వేప నూనె 5 మి.లీ క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా డైక్లోరోవాస్ 1 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పచ్చదీపపు పురుగులు :** ఈ పురుగుల ఉధృతి నవంబర్ నుండి జనవరి వరకు ఉంటుంది. పిల్ల మరియు తల్లి పురుగులు ఆకుల నుండి రసాన్ని పీల్చి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయి. తర్వాత దశలో ఆకులు పసుపు వర్ణంలోకి మారి మాడిపోతాయి. పిల్ల, తల్లి పురుగులు పాలిపోయిన ఆకుపచ్చ రంగులో ఉండి ఆకుల అడుగు భాగాన ప్రక్కకు నడుస్తూ కనిపిస్తాయి. దీని నివారణకు తొలి దశలో వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి కలపి ఆకుల అడుగు భాగాలు బాగా తడిచేలా పిచికారి చేయాలి.

**ఆకుతొలిచే పురుగు :** ఈ పురుగు ఉధృతి ఆగష్టు మాసం నుండి అక్టోబర్ వరకు వుంటుంది. పిల్ల పురుగు పసుపు వర్ణం కలిగి ఉంటుంది. రెక్కల పురుగు చిన్న ఈగ మాదిరిగా వుండి లేత ఆకులపై గ్రుడ్లను పెడుతుంది. తొలి దశలో పిల్ల పరుగులు ఆకు పొరలలోనికి పోయి సొరంగాలుగా తొలిచి ఆకులను తింటాయి. దీనినే పాముపొడ తెగులు అంటారు. ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు ఆకులు పూర్తిగా ఎండి రాలిపోతాయి.

తొలి దశలో ఆకులపై పురుగు ఉధృతి గమనించగానే వేపనూనెను (5మి.లీ./లీ) పిచికారి చేయాలి.

**తెగుళ్ళు**

**ఆకుమచ్చ తెగులు :** ఈ తెగులు శిలీంధ్రం వలన వస్తుంది. ఆకులకు రెండువైపుల చిన్న చిన్న నల్లని లేక గోధుమ రంగు మచ్చలు ఏర్పడి తర్వాత పెద్దవై లేత గోధుమ రంగులోకి మారతాయి. దీని నివారణకు తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే మాంకోజెబ్ 3 గ్రా. లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి రెండుసార్లు, వారం రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**వడలు తెగులు/ఎండు తెగులు :** ఈ తెగులు విత్తిన 20-60 రోజుల మధ్య కాలంలో ఎక్కువగా రావడానికి ఆస్కారముంది. లేత దశలో తెగులు సోకినట్లయితే మొక్కలు వడలిపోయి, బీజ పత్రాలు రంగును కోల్పోయి, పాలిపోయి తర్వాత మొక్కలు చనిపోతాయి. కాని కాస్త పెద్ద మొక్కలకు సోకినట్లైతే, లేత ఆకులు ముందుగా వడలిపోయి, క్రమేపి పసుపు వర్ణానికి మారి తర్వాత ఎండిపోతాయి. కాండం చీల్చి చూస్తే లోపల తెల్లని బూజు లాంటి శిలీంధ్రపు పెరుగుదలను గమనించవచ్చు.

**నివారణ :** నీరు నిలిచే నేలల్లో మరియు పల్లపు ప్రాంతాల్లో ఆముదం సాగుచేయరాదు. పంట మార్పిడి పద్ధతిని కనీసం 2-3 సంవత్సరాల కొకసారి పాటించాలి. ఇందుకుగాను సజ్జ పంటను విత్తుకోవచ్చు. కిలో విత్తనానికి 3గ్రా. కార్బండైజిమ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. ఒక ఎకరంలో ఉపయోగించుటకు గాను 50-75 కేజీల బాగా మాగిన పశువుల ఎరువుకు ఒక కిలో ట్రైకోడెర్మా పొడి మందును కలిపి, గోనె సంచితో కప్పి ప్రతి 2-3 రోజులకు ఒకసారి నీరు చిలకరిస్తు ఉండాలి. 15 రోజుల తరువాత ఈ ఎరువును విత్తే ముందు నేలలో చాళ్ళలో వేసుకోవాలి. అంతర పంటగా కందిని వేయడం ద్వారా కొంత వరకు తెగులు ఉధృతిని తగ్గించవచ్చు. తెగులును తట్టుకునే వంగడాలైన జ్యోతి, డి.సి.హెచ్.177, పి.సి.హెచ్ 111, జ్వాల మరియు హరిత లాంటి రకాలను ఎన్నుకొని విత్తుకోవాలి. తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే కార్బండైజిమ్ 1గ్రా. లేదా కాపర్ఆక్సీక్లోరైడ్ 3గ్రా. లీటరు నీటిలో కలిపి వ్యాధి దశను బట్టి భూమిని మరియు మొక్కల మొదళ్ళను తడపాలి. తెగులు సోకి చనిపోయిన మొక్కలను ఎప్పటికప్పుడు పొలం నుండి తొలగించి నాశనం చేయాలి.

**కాయకుళ్ళు/బూజు తెగులు :** ఈ తెగులు వల్ల ముఖ్యంగా ఆముదం గెలపైన లేదా కొన్ని కాయలపైన గోధుమ రంగు మచ్చలేర్పడి, తర్వాత ఈ వ్యాధి అన్ని కాయలకు వ్యాపిస్తుంది. తెగులు సోకిన భాగాలపైన దూది పింజ

లాంటి బూడిద లేదా గోధుమ వర్ణపు శిలీంధ్రపు పెరుగుదల కన్పిస్తుంది. శిలీంధ్రపు బీజాలు గాలి ద్వారా ఒక మొక్క నుండి మరొక మొక్కకు వ్యాపిస్తాయి. తెగులు సోకిన కాయలు మెత్తబడి, కుళ్ళి రాలిపోతాయి. గెలపై ఉన్న పూలపై శిలీంధ్రం ఆశించటం వలన కాయలు తయారు కాకుండా నల్లగా మారిపోతాయి.

ఆముదం మొక్క గెలవేసే సమయంలో గాలిలో తేమ 90 శాతం పైన ఉండి, రాత్రి ఉష్ణోగ్రత $22^0$ సెల్సియస్ కన్న తక్కువగా ఉండి, తుఫాను వల్ల ఎడతెరిపి లేకుండా 5-6 రోజులుగా వర్షాలు పడుతున్నపుడు ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది.

**నివారణ :** పొలంలో మొక్కల మధ్య సరియైన దూరముండాలి. మరీ దగ్గరగా విత్తరాదు.పంటను ఆలస్యంగా కాకుండా సకాలంలో విత్తుకోవాలి. తెగులును పూర్తిగా తట్టుకునే వంగడాలు లేవు కనుక కొంత వరకు తట్టుకునే రకాలైన జ్వాల మరియు కిరణ్ రకాలను విత్తుకోవాలి. తుఫాను సూచనలు తెలిసిన వెంటనే వర్షానికి కనీసం 6-8 గం.ల ముందు లీటరు నీటికి 1గ్రాము కార్బండజిమ్‌ను లేక 1గ్రా. థయోఫెనేట్ మిథైల్‌ను కలిపి మొక్క అన్ని భాగాలు తడిసేలా పిచికారి చేయాలి. వర్షాలు తగ్గాక మళ్ళీ 6-8గం.లలోపు మరొకసారి కార్బండజిమ్‌తో పిచికారి చేయాలి. తెగులు సోకిన కాయలను, గెలలను కోసి పొలానికి దూరంగా వేసి తగులబెట్టి దీని వ్యాప్తిని అరికట్టాలి. వర్షాలు తగ్గిన తర్వాత నేలలో తేమ ఉన్నపుడు ఎకరాకు 20 కిలోల యూరియా మరియు 10 కిలోల పొటాష్ ఎరువులను అదనంగా పైపాటుగా వేసినట్టయితే తర్వాత వచ్చే గెలలు బాగా వచ్చి నష్టాన్ని కొంత వరకు తగ్గించుకునే వీలుకుదురుతుంది.

**పంటకోత-నిల్వ :** ఆముదపు పంట అంతా ఒకేసారి కోతకురాదు. 3-4 సార్లు కాయల కోయవలసి వస్తుంది. విత్తిన 90-95 రోజులకు మొదటి గెల కోతకు వస్తుంది. ఒక గెలలో 80 శాతం వరకు కాయలు ముదిరి, ఆకుపచ్చ రంగు నుండి లేత పసుపు రంగుకు మారినపుడు ఆ గెలను కోసుకోవాలి. కాయలను బాగా ఎండబెట్టి, తేలికైన కర్రలతో కొట్టి విత్తనాలను నూర్చుకోవాలి. గింజల్లో 9-10 శాతం తేమ ఉండేటట్లు బాగా ఎండబెట్టి గోనె సంచుల్లో నిలువ ఉంచుకోవాలి.

**తక్కువ ఖర్చుతో అధిక దిగుబడికి సూచనలు :**

1. నాణ్యత గల విత్తనాన్ని వాడాలి.
2. విత్తనశుద్ధి తప్పని సరిగా చేయాలి.
3. ఎరువులను తగు మోతాదులో సరైన సమయంలో వేయాలి.
4. కీలక దశలో వీలైతే నీరు పెట్టాలి. వర్షాధార పంటకు ఎకరానికి రెండు వేల రూపాయల ఖర్చుతో నాలుగు వేల నికరాదాయం వస్తే, నీటి పారుదల వుంటే ఎకరానికి ఐదువేల రూపాయల ఖర్చుతో పదివేల నికరాదాయం పొందవచ్చు.
5. సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలి.
6. సరైన సమయంలో కోయడం మరియు నూర్చుట చాలా ముఖ్యం.

**దిగుబడి :** ఖరీఫ్‌లో ఆముదం పండించినప్పుడు ఎకరాకు 4-6క్వి. దిగుబడి వస్తుంది. అదే రబీలో సంకర రకాలను వేసి మంచి యాజమాన్య పద్ధతులను పాటిస్తే, ఎకరాకు 12-15 క్వి. దిగుబడి వస్తుంది.

ఆముదం పంట సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా :
**"ప్రధాన శాస్త్రవేత్త (నూనెగింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం-509 215**
**మహబూబ్‌నగర్ జిల్లా", ఫోన్ నెం.: 08540-228646, సెల్ : 9441210514**